క్లుప్తంగా

చీరలు అందజేత

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడిలో కోలాట బృందం మహిళలకు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అందించిన చీరలకు సోమవారం రాత్రి మండల వైస్ ఎంపీపీ గుత్తా రవి, మంత్రి పీఏ రవికిరణ్, గ్రామ సర్పంచ్ గొర్రె క్రిష్ణవేణి తదితరులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన 20 కుటుంబాలు బీఆర్ఎస్‌లో చేరారని, వారందరికీ పార్టీ కండువాలు కప్పి స్వాగతించినట్లు పేర్కొన్నారు. గొర్రె శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

తిరుమలాయపాలెం: సమాజ సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు ముందుండాలని పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు సేవా కార్యక్రమాలు చేపట్టాలని తద్వారా సమాజం పట్ల అవగాహన పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ రామయ్య, అధ్యాపకుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన న్యూవిజన్..

ఖమ్మంసహకారనగర్: స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన నిర్వహించిన నగర నార్త్ జోన్ అంతర్ పాఠశాలల క్రీడాపోటీల్లో న్యూ విజన్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎండీ.అబాద్ అలీ తెలిపారు. ఈనెల 20 నుంచి నిర్వహించిన ఈ పోటీల్లో ఖో-ఖో జూనియర్ బాలుర విభాగం, సీనియర్ బాలికల విభాగాల్లో ద్వితీయ స్థానాలు, జూనియర్ కబడ్డీ బాలికల విభాగంలో ద్వితీయ స్థానం, సీనియర్ త్రోబాల్ బాలుర విభాగంలో ద్వితీయ స్థానం పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సత్తాచాటిన విద్యార్థులను న్యూ విజన్ విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సీహెచ్‌జీకే కార్తీక్, ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు సంపత్, రఘుపతి, స్వామి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ఇన్‌స్పైయిర్ ఆధ్వర్యాన అవగాహన

ఖమ్మంరూరల్: మండలంలోని కోదాడ క్రాస్‌రోడ్‌లో గల గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యార్థినులకు ఇన్‌స్పైయిర్ అండ్ ఇగ్నైయిట్ ఫౌండేషన్ తరఫున భవిష్యత్ ప్రణాళికలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యుడు డి.సుధాకర్, సైకాలజిస్టు ఎస్‌కె.షరీఫ్‌లు మాటాడుతూ.. విద్యార్థులు అనునిత్యం చదువుపై ఏకాగ్రతతో మనస్సు విషయ పరిజ్ఞానాన్ని మననం చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఝాన్సీరాణి, వైస్ ప్రిన్సిపాల్ జె.శ్రీలక్ష్మి, సాఫ్ట్‌స్కిల్స్ ట్రైనర్ వి.అప్పారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాలు వర్ధంతి..

ఖమ్మంరూరల్: ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం తృతీయ వర్ధంతి సందర్భంగా మండలంలోని పెదతండాలో గల ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం బాలు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.గోపాల్ మాట్లాడుతూ.. బాలు ఘనతను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ వెంకటరమణ, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

టీడీపీ లీగల్ సెల్ ఆధ్వర్యాన దీక్ష

ఖమ్మం లీగల్: మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు అరెస్టు గర్హనీయమని పేర్కొంటూ టీడీపీ లీగల్ సెల్ ఆధ్వర్యాన ఖమ్మంలో న్యాయవాదులు సోమవారం ఒక రోజు దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో పలువురు న్యాయవాదులు మాట్లాడగా, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావు సంఘీభావం తెలిపారు. కాగా, న్యాయవాదులకు సాయంత్రం టీడీపీ నాయకులు కూరపాటి వెంకటేశ్వర్లు, వాసిరెడ్డి రామనాథం నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. న్యాయవాదులు కొల్లి సత్యనారాయణ, కాటమనేని రమేష్, కే.వీ.కృష్ణారావు, పి.పట్టాభి, వడ్డెల కృష్ణమూర్తి, పి.మాధవరావు, గొల్లపూడి రామారావు, కాశ్వారి లక్ష్మీనర్సింహారావు, కె.రాధాకృష్ణ, ముక్కా నాగేశ్వరరావు, కొండపల్లి శ్రీనివాస్ చౌదరి పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	మార్క్ అంటోని
వినోద	ది నన్
సాయిరాం	మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి
ఆదిత్య	7జీ బృందావన కాలనీ
శ్రీనివాస	జవాన్

- ఖమ్మంగాంధీచౌక్

ఏకదంతాయ.. వక్రతుండాయ

మండపాల్లో కొలువుదీరిన గణనాథుడికి భక్తులు సోమవారం భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులతో పాటు భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని ఏకదంతాయ.. వక్రతుండాయ అంటూ స్వామివారికి పూజలు చేశారు. అనంతరం మండపాల వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలను పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించి విరాళాలు అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంగాంధీచౌక్: ఆటోనగర్‌లో జ్యోతిర్లింగార్చన



ఖమ్మంమయూరిసెంటర్: 51వ డివిజన్‌లో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం



ఖమ్మంగాంధీచౌక్: రజక వీధిలో అన్నదానం చేస్తున్న మాజీ కార్పొరేటర్ బాలగంగాధర తిలక్



ఖమ్మంరూరల్: శ్రీసిటీలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఖమ్మంఅర్బన్: అల్లీపురంలో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కూసుమంచి: అన్నదానాన్ని ప్రారంభిస్తున్న సీఐ జితేందర్‌రెడ్డి, ఎంపీపీ బానోత్ శ్రీనివాస్



కామేపల్లి: ముచ్చర్లలో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ లూసీ



నేలకొండపల్లి: మంగాపురంలో విరాళం అందిస్తున్న పొంగులేటి సోదరుడు ప్రసాదరెడ్డి



తిరుమలాయపాలెం: పూజలో ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి కుమార్తె దీప్తి



కూసుమంచి: కిష్టాపురంలో విరాళం అందిస్తున్న పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరి దయాకర్‌రెడ్డి

టోర్నీ బరిలో 16 పాఠశాలలు..

హార్వెస్ట్‌లో ప్రారంభమైన సౌత్‌జోన్ పాఠశాలల క్రీడలు



బెలూన్లు ఎగురవేసి క్రీడలను ప్రారంభిస్తున్న పాఠశాల యాజమాన్యం, అతిథులు

ఖమ్మం స్పోర్ట్స్: కరోనా తర్వాత నిర్వహిస్తున్న మొదటి సౌత్‌జోన్ నగర పాఠశాలల క్రీడలు సోమవారం నగరంలోని హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు పోటీల పాటు నిర్వహించనున్న ఈ పోటీలను ఖమ్మం అర్బన్ ఎంఈఓ ఎం.శ్రీనివాస్ ప్రారంభించగా.. తొలి రోజు అండర్-14, 17లలో వివిధ క్రీడాంశాల్లో నగరంలోని దక్షిణ ప్రాంతానికి చెందిన 16 పాఠశాలల నుంచి 500 మంది క్రీడాకారిణులు పాల్గొన్నారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ.. ఈ క్రీడా పోటీలకు ఆదరణ లభించడం శుభపరిణామన్నారు. తొలుత జాతీయ జెండాను ఎగువవేసి క్రీడల జెండాను ఆవిష్కరించి బెలూన్స్ ఎగురవేసి మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. మూడో రోజుల పాటు జరిగే ఈ క్రీడా పోటీల్లో ముందు రోజు బాలికలకు నిర్వహిస్తుండగా.. రెండో రోజు బాలురకు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, త్రోబాల్ అంశాల్లో మాత్రం పోటీలు జోరుగా కొనసాగుతున్నాయి. అయితే నాకౌట్ పద్ధతిలో క్రీడా పోటీలు జరగడంతో ఓడిన జట్టు వెనుతిరుగుతున్నాయి. క్రీడాకారులను అన్ని సౌకర్యాలను నిర్వాహకులు కల్పించారు. కాగా, ఈ పోటీలకు ఆతిథ్యమిస్తున్న పాఠశాల కరస్పాండెంట్ పి.రవిమారుత్, క్రీడల కన్వీనర్ ప్రిన్సిపాల్ ఆర్.పార్వతీరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు తమవంతు సహాయం అందజేస్తూ క్రీడలను ప్రోత్సాహిస్తున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలలతో అలరించారు. ఈ కార్యక్రమంలో శాంతినగర్, రాజేంద్రనగర్ పాఠశాలల హెచ్‌ఎంలు కృష్ణకుమారి, గాయత్రి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు నాగయ్య, వి.పారిజాతం, బి.సత్యనారాయణ, కె.ఆదర్శ్‌కుమార్, టి.గోపాల్‌రావు, ఎస్.కె. నాగూల్ మీరాలు పాల్గొన్నారు.

త్రోబాల్ విజేత 'హార్వెస్ట్'..

నగరంలోని హార్వెస్ట్ స్కూల్‌లో జరిగిన క్రీడల్లో త్రోబాల్ పోటీల్లో అండర్-14 బాలికల విభాగంలో విజేతగా హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్ జట్టు దక్కించుకోగా.. రెండోస్థానంలో శ్రీచైతన్య పాఠశాల జట్టు నిలిచింది. అలాగే బాలికల వాలీబాల్ ఫైనల్స్‌లో జెడ్పీఎస్ఎస్ కొత్తగూడెం ప్రథమ స్థానంలో,హార్వెస్ట్ రెండో స్థానంలో నిలవగా.. అండర్-17 త్రోబాల్‌లో హార్వెస్ట్, శ్రీచైతన్య పాఠశాలలు సంయుక్త విజేతలుగా నిలిచాయి.


ఉపాధి కోసం ఉద్యమించాలి




సమావేశంలో మాట్లాడుతున్న రాకేశ్

తిరుమలాయపాలెం: ఉద్యోగ, ఉపాధి కోసం యువత ఉద్యమించాలని పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాకేశ్ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని పిండిప్రోలులో గల రాయల వెంకటనారాయణ భవనంలో నిర్వహించిన పీవైఎల్ పాలేరు డివిజన్ 8వ మహాసభలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి మోసం చేశాయని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం నోటిఫికేషన్ల పేరుతో విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని, మోదీ ప్రభుత్వం సనాతన ధర్మం పేరుతో దళిత, గిరిజన, బడుగు బలహీన, ఆదివాసి వర్గాలపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్నారు. అంతేకాక ప్రజాపంథా జిల్లా నాయకుడు కమ్మకోమటి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్నికలు సమయాన సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర పాలకులకు రానున్న ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు బందెల వెంకయ్య, సీ.వై పుల్లయ్య, పార్టీ మండల కార్యదర్శి సోమనపల్లి వెంకటేశ్వర్లు, రాయల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పీవైఎల్ పాలేరు డివిజన్ కమిటీని ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులుగా గోకినపల్లి నరేశ్, మామిడాల వెంకటేశ్‌లతో పాటు మరికొంత మంది సభ్యులను ఎన్నుకున్నారు.

దీన్‌దయాళ్ జీవితం అందరికీ ఆదర్శం



నేలకొండపల్లి: నివాళులర్పిస్తున్న బీజేపీ శ్రేణులు



ఖమ్మంమామిళ్లగూడెం: జిల్లా పార్టీ కార్యాలయంలో బీజేపీ నాయకుల నివాళి

పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జీవితం అందరికీ ఆదర్శమని పలువురు వక్తలు అన్నారు. సోమవారం దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకొని బీజేపీ ఆధ్వర్యాన మండల కేంద్రాలు, పార్టీ కార్యాలయాల్లో నాయకులు దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. అంత్యోదయ ప్రభుత్వ ఫలాలు చిట్టచివరి వ్యక్తి వరకు అందాలని కృషి చేసిన వ్యక్తి దీన్‌దయాల్ అని ఆయన సేవలను స్మరించుకున్నారు.

– సాక్షినెట్‌వర్క్

గీత కార్మికుడికి ఆర్థిక సాయం

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాదారం గ్రామానికి చెందిన గీత కార్మికుడు బాలబోయిన సైదులు ఇటీవల తాటి చెట్టు పైనుంచి పడగా.. సోమవారం జాగృత్ ట్రస్ట్ అధినేత డాక్టర్ కేసగాని రాజశేఖర్‌గౌడ్ బాధితుడి ఇంటికి వెళ్లి సైదులును పరామర్శించారు. అనంతరం వైద్య ఖర్చుల నిమ్మిత్తం కొంత ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం ప్రతినిధులు కొండా శ్రీను, బిచ్చాల అన్వేశ్, దేశబోయిన వెంకటేశ్వర్లు, కాసాని సతీశ్ గౌడ్, కొండా నరేశ్, కృష్ణ, వాసు తదితరులు పాల్గొన్నారు.

'ఆశ'లకు రూ.18 వేల వేతనం ఇవ్వాలి



సమ్మెలో పాల్గొన్న ఆశావర్కర్లు

ఖమ్మంమయూరిసెంటర్: ఆశావర్కర్లకు నెలకు రూ.18 వేల వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విష్ణు, కళ్యాణం వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద గల ధర్నాచౌక్‌లో తెలంగాణ ఆశ వర్కర్ సీనియర్ (సీఐటీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యాన ఆశావర్కర్లు చేపట్టిన సమ్మెలో వారు మాట్లాడారు. బడుగు బలహీన వర్గాలకు చెందిన వారే ఆశావర్కర్లుగా విధులు నిర్వర్తిస్తున్నారని, వీరు ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంలో భాగస్వాములుగా ఉంటూనే వైద్య, ఆరోగ్య శాఖ కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొంటున్నారని తెలిపారు. ఆశల సమస్యలను పరిష్కరించకుంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు జాలరపు మంగమ్మ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రమణ, నాయకులు సునీత, శశిరేఖ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలన



సూచనలు చేస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

రఘునాథపాలెం: మండలంలోని రేగులచలక నర్సరీ, ప్రకృతివనాన్ని ఎంపీడీఓ రామకృష్ణ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వనంలో చెత్త లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సంగీత తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రుణాలు అందిస్తున్న ఎమ్మెల్యే కందాళ

ఖమ్మంరూరల్: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా పని చేస్తూ.. రైతులకు తెలంగాణ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని తాళ్లేసేతండాలో గల ఏదులాపురం పీఏసీఎస్‌లో 268 మంది రైతులకు రూ.1.05 కోట్ల వ్యవసాయ రుణాలను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఎకరాకు రూ.10 వేలు చొప్పున సీఎం కేసీఆర్ రైతుబంధు ద్వారా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కొత్తగా రుణాలు పొందిన వారు వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం మండలంలోని 42 గణేశ్ మండపాలకు ఒక్కో మండపానికి రూ.10వేలు చొప్పున అందించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, పీఏసీఎస్ చైర్మన్ జర్పుల లక్ష్మణ్‌నాయక్, సీఈఓ మహ్మద్‌అలీ, డైరెక్టర్లు రైతులు తదితరులు పాల్గొన్నారు.

రాతి శిలలకు పూజలు..

కూసుమంచి: కూసుమంచిలో నూతనంగా నిర్మించే శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ నిర్మాణం కోసం ఏపీలోని మదనపల్లి నుంచి రాతి శిలలు తీసుకురాగా ఆలయానికి తరలించగా.. ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి శిలలకు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ఆలయ నిర్మాణ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉపేంద్రచారి

నేలకొండపల్లి: విశ్వకర్మ పంచ వృత్తుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని సంఘం మండల అధ్యక్షుడు తుడిమళ్ల ఉపేంద్రచారి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో మండల స్థాయి విశ్వకర్మ పంచ వృత్తుల ఐక్య సంఘం, శ్రీ పోతులూరి వీరబ్రహ్మం ఆలయ నిర్మాణ కమిటీని ఎన్నుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. సంఘం అధ్యక్షుడిగా తుడిమళ్ల ఉపేంద్రచారి, పట్టణ అధ్యక్షుడిగా నంచర్ల దేవీప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కొమరగిరి పురుషోత్తమ్, గౌరవ సలహాదారుడిగా గంటల శంకరయ్య, గౌరవ ఉపాధ్యక్షుడిగా అనంతు బ్రహ్మం, కన్వీనర్‌గా తొగాటి నాగచారి, కో-కన్వీనర్‌గా రంగు వెంకన్న, కోశాధికారిగా మల్లేల శ్యామ్‌కుమార్, ప్రచార కార్యదర్శిగా కంది రామకృష్ణచారి, ఉపప్రచార కార్యదర్శిగా మోదుకూరి నాగచారి, దేవాలయం కమిటీ ప్రతినిధిగా కోడూరి రామకృష్ణలు నియమితులయ్యారు. అనంతరం దేవాలయ నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని కమిటీ తీర్మానించింది.

నేతల జోక్యంతో వృత్తిదారులకు నష్టం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వృత్తిదారులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వం బీసీ వృత్తిదారులకు అందిస్తున్న ఆర్థిక సాయంలో రాజకీయ జోక్యం ఉండడంతో అర్హులైన వృత్తిదారులు నష్టపోతున్నారని వృత్తిదారుల సమన్వయ కమిటీ కన్వీనర్ ఝెర్రా శ్రీకాంత్ అన్నారు. బీసీలకు ఆర్థిక సాయం, గొర్రెల పంపిణీ వంటి పథకాల్లో రాజకీయ నాయకుల జోక్యం ఉండొద్దని డిమాండ్ చేస్తూ.. సోమవారం కలెక్టరేట్ ఎదుట వృత్తిదారుల సమన్వయ కమిటీ ఆధ్వర్యాన నిరసన తెలిపిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు కేవలం బీఆర్ఎస్ నేతలకే ఇస్తున్నారని మండిపడ్డారు. వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న వారికి అన్యాయం జరగకుండా అధికారులు దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ జిల్లా నాయకులు చింతలచెర్వు కోటేశ్వరరావు, తుశాకుల లింగయ్య, బోడపట్ల సుదర్శన్, దొంతుబోయిన నాగేశ్వరరావు, సత్తెనపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దళిత బంధు జాబితా విడుదల చేయాలి



రాస్తారోకో చేస్తున్న దళితులు

రఘునాథపాలెం: దళిత బంధు ఎంపికల్లో రాజకీయ నాయకులు తమఅనుకూలంగా ఉన్న వారికే ఇస్తున్నారని ఆరోపిస్తూ సోమవారం మండలంలోని రేగులచలక జీపీ కార్యాలయం ఎదుట ఖమ్మం పాపటపల్లి ప్రధాన రోడ్డులో కొంతమంది దళితులు ఆందోళనకు దిగారు. ఒకే ఇంట్లో నలుగురికి ఇచ్చేలా పేర్లతో ప్రతిపాదనలు పంపారని, ఎంపిక జాబితాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఇదే సమస్యపై తాము మండల, జిల్లా స్థాయిలో అధికారులకు విన్నవించినా.. జాబితాను విడుదల చేయకుండా పథకాన్ని పక్కదారి పట్టిస్తున్నారని నినాదాలు చేశారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో ఎస్ఐ కొండలరావు అక్కడకు చేసుకుని సమస్యను అధికారులకు వివరించాలని సర్దిచెప్పి ఆందోళనను విరమింపచేశారు. ఈ విషయంపై ఎంపీడీఓ రామకృష్ణను వివరణ కోరగా.. ఇంతవరకు ఎలాంటి జాబితా వెల్లడించలేదని, మండలంలో ఎంపికలు అనేది లేదని తెలిపారు.

ముచ్చర్లలో 'మేరా మిట్టి.. మేరా దేశ్'



మట్టిని సేకరిస్తున్న సర్పంచ్ జాయ్‌లూసీ

కామేపల్లి: ప్లాస్టిక్‌ను నిర్మూలించి పర్యావరణాన్ని కాపాడుకోవాలని ఎంపీడీఓ విజయభాస్కరరెడ్డి అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గిరిజన బాలికల ఆశ్రమ, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్లాస్టిక్ నిర్మూలన, నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కల్పించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అలాగే ముచ్చర్ల గ్రామంలో సర్పంచ్ జాటోత్ జాయ్‌లూసీ ఆధ్వర్యాన మేరా మిట్టి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి నుంచి మట్టి సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి బానోత్ రవికుమార్, పెండ్ర అనిల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖాకీ చొక్కాలు పంపిణీ



ఖాకీ చొక్కాలు పంపిణీ చేస్తున్న నల్లమల

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని కాల్వొడ్డులో గల నయాబజార్ కాలేజ్ ఆటో అడ్డాలో సోమవారం నామా ముత్తయ్య ట్రస్ట్ ఆధ్వర్యాన ఆటో కార్మికులకు ఖాకీ చొక్కాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతు బంధు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వరరావు మాట్లాడారు. కార్మిక సంఘం నాయకుడు కాసాని నాగేశ్వరరావు, జిల్లా టెలికాం సలహా మండలి సభ్యులు చిత్తారు సింహాద్రి యాదవ్, మోరంపూడి ప్రసాద్, నామ సేవా సమితి నాయకుడు చీకటి రాంబాబు, ఆటో వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు గొడుగు శ్రీనివాస్, యూనియన్ అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు షేక్ బాబా సాహెబ్, ఆటో యూనియన్ నాయకులు పి.రంగయ్య, ఎ.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్‌సీ బోర్డును రద్దు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీఎస్పీ నాయకులు

ఖమ్మంరాపర్తినగర్: గ్రూప్-1 పరీక్ష పత్రాలను సంతలో కూరగాయల మాదిరిగా అమ్ముకున్న టీఎస్‌పీఎస్‌సీ బోర్డును వెంటనే రద్దు చేయాలని జిల్లా అధ్యక్షుడు బుర్ర ఉపేంద్ర సాహు డిమాండ్‌చేశారు. సోమవారం బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యాన కలెక్టరేట్‌ను ముట్టడించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రూప్-1 పరీక్ష పత్రాల లీకేజ్ వ్యవహారంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పాత్ర ఉండడంతోనే నేటి వరకు బోర్డు చైర్మన్ జనార్దన్‌రెడ్డిని అరెస్ట్ చేయలేదని ఆరోపించారు. టీఎస్‌పీఎస్‌సీ బోర్డు ద్వారా నిర్వహించిన పరీక్షలన్నీ అమ్ముకున్నవేనని అన్నారు. సీబీఐ ద్వారా అసలు దోషులెవరో తేల్చి, ఇప్పుడున్న బోర్డును పూర్తిగా ప్రక్షాళన చేసి నూతన బోర్డును నియమించాలని, గ్రూప్-1 అభ్యర్థులకు రూ.లక్ష చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ షేక్.సుభాని, మహిళా కన్వీనర్ బానోత్ రజిని, జిల్లా కార్యదర్శులు పల్లెపోగు విజయ్, బానోత్ రాంబాబు, బి.ఉపేందర్, ఉదయ్, పృథ్వి, నామ విజయ్, నవీన్, వెంకటనారాయణ, అనిత, తదితరులు పాల్గొన్నారు.